మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# జిల్లా క్లబ్‌కు రూ.కోటిన్నర మంజూరు..!

**- క్లబ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతాం..**

**- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ క్లబ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. క్లబ్ ఆధునీకరణకు రూ.1.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. క్లబ్‌ను కొత్త హంగులతో అత్యాధునికంగా మారుస్తామన్నారు. బుధవారం క్లబ్ వద్ద జరుగుతున్న పనులను మంత్రి క్లబ్ సభ్యులతో కలిసి పరిశీలించారు. క్లబ్ నిర్వహణ సవ్యంగా ఉండాలని సూచించారు. అందరికీ ఆహ్లాదం పంచేలా, కుటుంబ సమేతంగా వచ్చేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంఘ వ్యతిరేఖ శక్తులను క్లబ్‌లోనికి రానివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కే ప్రతాప్‌కుమార్, మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ధర్నా చేయడం విడ్డూరం.. బిఆర్ఎస్ నేతల విమర్శ..!

**భూత్పూర్, ఆగస్టు 09 ప్రభాతవార్త :** కనీసం గ్రామాలకు రోడ్లు వేయలేని అసమర్థ కాంగ్రెస్ నాయకులు రోడ్ల గురించి ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని బిఆర్ఎస్ భూత్పూర్ మండల అధ్యక్షుడు, మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్, మార్కెట్ కమిటి మాజీ వైస్ ఛైర్మన్ సత్తూరు నారాయణ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సిఎం కెసిఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మారుమూల తండాలకు సైతం బిటి రోడ్లు గురించి తండావాసుల్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల రాజకీయ స్వావలంబనకు పాటుపడుతోందని చెప్పారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఛైర్మన్ ఇతర నాయకులు మాట్లాడుతూ తాము అధికారంలో ఉండి ఏమి చేయలేని కాంగ్రెస్ ప్రస్తుతం రోడెక్కడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. భూత్పూర్ సరిహద్దు ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల రోడ్ల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం గొప్లపూర్ నుంచి చేగుంట వరకు 10మీటర్ల వెడల్పు గల నాలుగులైన్ల రోడ్డుకు రూ. 3కోట్లు, డబుల్ లైన్ 7 మీటర్ల వెడల్పు రోడ్డుకు 2022లో రూ.10 కోట్ల నిధులు మంజూరై పనులు పూర్తయ్యాయని, గోప్లాపూర్ గ్రామం నుంచి 900 మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు కొందరు భూ యజమానులు తన స్వార్థం కోసం, స్వప్రయోజాల కోసం కోర్టులో దావావేసి రోడ్డు నిర్మాణ పనులు అడ్డుకున్నారని, నాడు కాంగ్రెస్‌లో ఉన్నవారే నేడు కాంగ్రెసేతర పార్టీలో ఉంటూ అభివృద్ధిని అడ్డుకుంటూ తమ స్వప్రయోజనాలు, స్వార్థం కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు అభూత కల్పన చేస్తూ ప్రజల్ని మభ్యపెట్టే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. విలేఖరుల సమావేశంలో పార్టీ నాయకులు సత్తూరు అశోక్‌గౌడ్, సత్తూరు సదానంద్‌గౌడ్ పాల్గొన్నారు.



# వీఆర్‌ఏలను ఇతర శాఖలకు కేటాయిస్తాం..: కలెక్టర్ జి.రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఆర్‌ఏలను ఇతర శాఖలకు కేటాయించనున్నట్లు కలెక్టర్ జిరవినాయక్ తెలిపారు. వీఆర్‌ఏలను ఇతర శాఖలకు కేటాయించే విషయాన్ని బుధవారం సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 61 ఏండ్ల కన్నా తక్కువ వయస్సున్న సర్వీస్‌లో ఉన్న వీఆర్‌ఏలను గుర్తించి వారి ధ్రువపత్రాలన్నింటినీ పరిశీలించిన మీదట ఆయా శాఖలకు కేటాయించడం జరుగుతుందన్నారు. వీరిని నియామక ఉత్తర్వులు ఇచ్చే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలన్నారు. జిల్లాలో సుమారు 508 మంది వీఆర్‌ఏలు ఉన్నారని వారందరినీ 16శాఖలకు కేటాయించినట్లు వెల్లడించారు. వారి ధ్రువపత్రాల పరిశీలన బుధవారం రాత్రికే పూర్తి చేయాలని ఆదేశించారు. డిగ్రీ ఆపై అర్హత ఉన్నవారికి జూనియర్ అసిస్టెంట్, అంతకంటే తక్కువ విద్యార్హతలున్న వారికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన వారికి నేడు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేస్తామన్నారు. 61 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న వీఆర్‌ఏలు గురువారం ఉదయం 10గంటల వరకు నూతన కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకోవాలని, అక్కడ వారికి నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు.



### క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు..

పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ జి రవినాయక్ అన్నారు. బుధవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మహబూబ్‌నగర్ పట్టణంలోని 18పాఠశాలలు, హన్వాడ మండలానికి చెందిన రెండు పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 25మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 1116 చొప్పున నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యర్కమంలో క్లబ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సెక్రెటరీ దత్తు, వైస్ ప్రెసిడెంట్ బాదం శ్రీనివాసులు, గజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంఈవో జయశ్రీ పాల్గొన్నారు.

# గోప్లాపూర్ వద్ద కాంగ్రెస్ ధర్నా..!!

**భూత్పూర్, ఆగస్టు 09 ప్రభాతవార్త :** భూత్పూర్ నుంచి గోప్లాపూర్ వరకు ఉన్న బిటిరోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి (జిఎంఆర్) పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జిఎంఆర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు స్వలాభంపై ఉన్న శ్రద్ధ రోడ్లను బాగు చేయించడంలో చూపించడం లేదని ఆరోపించారు. ఒకేళ బిఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే చొరవ చూపకుంటే చందాలేసైనా రోడ్డును బాగు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కెసిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డితో పాటు నాయకులు మొహ్మద్ సాదిక్, గోవర్ధన్‌గౌడ్, లిక్కి నవీన్‌గౌడ్, లిక్కి విజయ్‌కుమార్ గౌడ్, హరినాయక్, లాలునాయక్, అగిరి రవి, తదితరులుపాల్గొన్నారు.





# అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తాం..

**- హామీ ఇచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి నిరంజన్‌రెడ్డి**

**వనపర్తి టౌన్, ఆగస్టు 9, ప్రభాతవార్త:** అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం అంగన్వాడీల గౌరవాధ్యక్షురాలు అడేపు వరలక్ష్మి మంత్రి నిరంజన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అంగన్వాడీల సమస్యలపై త్వరలో వనపర్తిలో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామని అంగన్వాడీ సెంటర్ల నిర్వాహణ సక్రమంగా జరిగేటట్లు చూసుకోవాలని మంత్రి ఆదేశించారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే పరిష్కరించిందని మిగిలిపోయిన సమస్యలను కూడా త్వరలో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారాస జిల్లా అధికార ప్రతినిధి , మున్సిపల్ వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్ పాల్గొన్నారు.


మంత్రి నిరంజన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అంగన్వాడీల గౌరవాధ్యక్షురాలు అడేపు వరలక్ష్మి

# సెప్టెంబర్ 2న మెగా జాబ్‌మేళా..!

**10 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా 100 కంపెనీలతో నిర్వహిస్తాం**

**ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి ఇక్కడే ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ లక్ష్యం**

**రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్**


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు


జాబ్‌మేళాకు హాజరైన యువకులు, నిరుద్యోగులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 09 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 700ల నుండి 800ల స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని, అయితే సెప్టెంబర్ 2న నిర్వహించే మెగాజాబ్ మేళాలో జిల్లాలోని 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. టాస్క్ ఆధ్వర్యంలో బుధవారం మహబూబ్‌నగర్‌లోని శిల్పారామంలో నిర్వహించిన మెగాజాబ్ మేళకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒకప్పుడు బతుకు దెరువు కోసం మహబూబ్‌నగర్ నుండి దేశంలోని అన్ని ప్రాంతాలతో పాటు, ప్రపంచంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారని, ప్రపంచంలో పాలమూరు లేబర్ అంటే ప్రఖ్యాతి అని, ఎక్కడ నిర్మాణ పనులు జరిగిన పాలమూరు లేబర్ కనిపించేవారని అన్నారు. అంతేకాక అతి తక్కువ అక్షరాస్యత, ఆకలి చావులు ఇక్కడే ఉండేవని, అనేక ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోక అలా ఉండిపోయాయని ముఖ్యంగా శిల్పారామం చెత్తాచెదారంతో, పెద్ద చెరువు కట్ట కాలుమోపడానికి కూడా సందులేని విధంగా ఉండేదని, మహబూబ్‌నగర్ పట్టణంలో 14 రోజులకు ఒక సారి తాగునీరు వచ్చేదని, ఇలాంటి ఇబ్బందులు అన్నిటిని అధిగమించి జిల్లాను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా యువతకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో దివిటిపల్లి వద్ద ఐటి కారిడార్‌ను నెలకొల్పడం జరిగిందని, దానిద్వారా బుధవారం టాస్క్ ఆధ్వర్యంలో 10 కంపెనీల నుండి 700ల నుండి 800ల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మొదటి విడత మహబూబ్‌నగర్ నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, సెప్టెంబర్ 2న 100 కంపెనీలతో 10 వేల మందికి ఉద్యోగాలు కల్పించే విధంగా మరో మెగాజాబ్ మేళాను నిర్వహిస్తున్నామని ఆ జాబ్‌మేళాలో జిల్లా లోని వారందరికి అవకాశాలు కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ పారిశ్రామికంగా, పర్యాటకంగా అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నదని, దేశంలోనే అతి పెద్దదైన 2097 ఎకరాలలో అర్బన్ ఎకో పార్కును ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని, త్వరలోనే జంగిల్ సఫారీ ప్రారంభించనున్నామని, హన్వాడలో ఫుడ్‌పార్కు రానుందని, మిని ట్యాంక్ బండ్‌లో సస్పెన్షన్ బ్రిడ్జి, ఐలాండ్, ఏసి బోట్ ఏర్పాటు చేస్తున్నామని, శిల్పారామం ఆవరణలో అతిపెద్ద వండర్‌లా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 13న మిని ట్యాంక్ బండ్‌పై 650 డ్రోన్లతో ప్రదర్శన నిర్వహిస్తున్నామని, ఈ ప్రద్శర్శనను అందరూ తిలకించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. బుధవారం నాటి జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగం రానివారు తిరిగి సెప్టెంబర్ 2న నిర్వహించే జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు. జాబ్‌మేళాకు హాజరైన వారందరి వివరాలను సేకరించి సిద్ధంగా ఉంచాలని నిర్వాహకులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆయా కంపెనీల సహకారంతో జాబ్‌మేళాలు నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చారని, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఎలాంటి ఉద్యోగం వచ్చిన ముందుగా ఉద్యోగంలో చేరాలని, ఆ ఉద్యోగం చేసుకుంటూనే ఇతర ఉన్నతమైన ఉద్యోగాల కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ కె.నరసింహ, టాస్క్ డైరెక్టర్ ప్రదీప్‌రెడ్డి మాట్లాడారు. మున్సిపల్ ఛైర్మన్ కెసి నరసింహులు, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, జిల్లా రైతుబంధు అధ్యక్షులు గోపాల్ యాదవ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గణేష్, మార్కెట్ కమిటి ఛైర్మన్ అబ్దుల్ రహమాన్, వైస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, రైతుబంధు డైరెక్టర్ మల్లు నరసింహారెడ్డి, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్, అడిషనల్ ఎస్పీ రాములు, ఆర్డీఓ అనిల్‌కుమార్, ఇంఛార్జి స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ యాదయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

# రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న కెసిఆర్..

**జూరాల కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేసిన ఎమ్మెల్యే.. కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే**

**ధరూర్, ఆగస్టు 09 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ప్రియదర్శిని కుడి కాలువకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పూజలు నిర్వహించి సాగు నీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పాలమూరు జిల్లా కరువు జిల్లాగానే కష్టాలను, కన్నీటిని దిగమింగుకుని ఇక్కడ జనం బతుకు జీవుడా అంటూ వలసలు వెళ్లేలా చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో పాలమూరు బిడ్డల తెగువ చూసిన సీఎం కెసిఆర్ మొదటి నుంచే ఈ జిల్లాపై ఎనలేని ప్రేమను చూపించారన్నారు. ఒప్పటి వలసలుజిల్లా పాలమూరు ఇప్పుడు అన్నపూర్ణగా మారిందన్నారు. కరోనాతో అల్లాడుతున్న కేరళ ప్రజల ఆకలిని అవసరాలను తీర్చేందుకు ముందుకొచ్చిందన్నారు. జూరాల ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేశామని, రైతులకు రైతుబంధు, వ్యవసాయానికి 24 గంటలు ఇవ్వడంతో పాటు సాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్‌లను పూర్తిచేసి వ్యవసాయానికి పెద్దపీట వేసిందన్నారు. జిల్లా రైతాంగం 30 ఎకరాల నుండి 50 ఎకరాల వరకు సాగునీరు రైతులకు పుష్కలంగా అందించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ వరకు రైతులు పంటను పండించుకోవడానికి నీటిని విడుదల చేయడం జరుగుతుంది. కాబట్టి రైతులు నీటిని వృధా చేయకుండా క్రమ పద్ధతిలో వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటిసి పద్మా వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్, ఎంపిపి విజయ్, వైస్‌ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ధరూర్ మండలపార్టీ అధ్యక్షుడు డిఆర్ విజయ్, రైతుబంధుసమితి అధ్యక్షుడు ఈశ్వరయ్య, సర్పంచ్‌లు శివారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్‌నాయుడు, భగీరథ, వంశీ, ఈశ్వర్, హనుమంతురెడ్డి, మునిరెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

# ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటుకు సహకారాన్ని అందిస్తా: ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**కల్వకుర్తి, ఆగస్టు 09 ప్రభాతవార్త :** రాష్ట్రంలో వెనుకబడిన ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు అవసరమైన ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చెప్పారు. బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి డివిజన్ ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర విద్యా కమిటి ఛైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, జిల్లా అధ్యక్షుడు బచ్చురామకృష్ణ, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు, కల్వకుర్తి వైస్ ఎంపిపి కొండూరు గోవర్ధన్‌లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ప్రీతిపాత్రుడు, స్నేహితులు ముఖ్యమంత్రి కెసిఆర్ అని కొనియాడారు. వైశ్యుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయడంతో పాటు వారికి సమస్యలు లేకుండా పాలన చేస్తున్న ప్రభుత్వం కెసిఆర్ ప్రభుత్వం అన్నారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని జిల్లా సహచర ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యాకమిటి ఛైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. వైస్ ఎంపిపి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ కార్పోరేషన్ ద్వారానే వైశ్యులకు మేలు జరుగుతుంది దాని సాధనే లక్ష్యంగా పని చేస్తాం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బలుస శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్మిచెర్ల రమేష్, కోశాధికారి శివ్వ జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, పిఆర్ఓ మిరియాల రాజయ్య, కిరాణం అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, మెడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, వాసవి క్లబ్ కోశాధికారి అశోక్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

# విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి..

**- 700మంది విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** విద్యార్థులు బాగా చదువుకొని ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్ల మండల కేంద్రంలోని సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో సీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బస్ పాస్‌ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థకు ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. గురుకులాలు ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తున్నదని, నాణ్యమైన భోజన సదుపాయం కల్పిస్తున్నది, ఒక్కో విద్యార్థిపై రూ.లక్షా ఇరవై వేల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ కోడ్గల్ యాదయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్, కౌన్సిలర్ సతీష్‌కుమార్, ముడా డైరెక్టర్లు ఇమ్ము, శ్రీకాంత్, నాయకులు పాలాది రామ్మోహన్, మచ్చల శ్రీను, టైగర్ నర్సింహులు పాల్గొన్నారు.


బస్ పాస్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


# ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి..

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.అశోక్‌కుమార్**

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 09 ప్రభాతవార్త :** బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆగస్టు15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో భారత స్వాతంత్ర వేడుకలను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించుటకు, గ్రౌండ్‌ను, దయాస్‌ను పోలీస్, రెవెన్యూ అధికారులు చక్కని అలంకరణతో సిద్ధం చేయాలని అన్నారు. సిపిఓ స్పీచ్‌కు సంబంధించిన విషయాలు చూడాలన్నారు. పరేడ్‌గ్రౌండ్‌లో జెండా వేడుకలు ఉన్నందున అందంగా తయారు చేయాలన్నారు. డీఈఓ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫైర్ వాహనం ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల సందర్భంగా ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ అరెంజ్‌మెంట్లు చేయాలని ఆదేశించారు. వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు వచ్చే ప్రజలకు, విద్యార్థిని, విద్యార్థులకు త్రాగునీటికి వాటర్ బాటిల్స్, స్వీట్లు సమకూర్చాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించుటకు వీలుగా వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన ప్రగతి సందేశాన్ని తయారుచేయాలని సిపిఓ అధికారిని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన స్టాళ్లను, శకటాలను ఏర్పాటు చేయాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓరాంచందర్, అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

# గిరిజన లంబాడి ఆదివాసులు తెలంగాణ సంస్కృతికి మూల స్తంభాలు..!


ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఏఐసిసి కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే డా. సంపత్‌కుమార్

**అలంపూర్, ఆగస్టు 09 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్ మండలం, జిల్లెలపాడు గ్రామంలోని గిరిజన లంబాడి తండాకు వెళ్లి ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డా. సంపత్‌కుమార్ లంబాడి తండాలో ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ మహారాజ్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి గిరిజన, బంజారా లంబాడి ప్రజలతో మమేకమై వారితో కలిసి ముచ్చటిస్తూ వారితో కలిసి ఆనందంగా గడిపారు. మిఠాయిలు పంచుకుని ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంహయాంలో వైఎస్ ప్రవేశపెట్టిన వైఎస్ విద్యోన్నతి పథకం గిరిజనుల అభివృద్ధి కోసం ఎంతగానో ఉపయోగపడ్డాయని ఇప్పటికి ఈ ప్రాంతంలో ఓటు వేయాలంటే పక్క ఊరు వెళాల్సి వస్తుందని అక్కడి ప్రజలు వాపోయారు. వారికి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ ఊరిలోనే ఓటువేసే వెసలుబాటు కల్పిస్తామని సంపత్‌కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం వాడ వాడల పర్యటించి అక్కడి ప్రజలు కష్ట సుఖాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ వడ్డేపల్లి దేవేంద్ర, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, అలంపూర్ మండల అధ్యక్షులు రాము, ఇటిక్యాల మండల అధ్యక్షులు రుక్మానందరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగశిరోమణి, అయిజ పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సులోచన పాల్గొన్నారు.

# 45 రోజుల వెలుగు అభ్యాసమిత్ర సంసిద్ధత కార్యక్రమం పరిశీలన



**మక్తల్,ఆగస్టు 09 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక శ్రద్ధతో ఆయన పర్యవేక్షణలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు, తెలుగు గణితం, ఆంగ్లం విషయాలలో తర్ఫీదుకై నిర్వహిస్తున్న వెలుగు అభ్యాసమిత్ర 45 రోజుల కార్యక్రమ పరిశీలనలో భాగంగా బుధవారం మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలదాసర్‌దొడ్డి పాఠశాలను జిల్లా రిసోర్స్ పర్సన్లు పి.నరెందర్, ఎం.లక్ష్మణ్‌లు ఉదయం ప్రార్థనవేళ సందర్శించారు.ఆతర్వాత 2వ,4వ,5వ తరగతులలో వెలుగు అభ్యాస మిత్ర సంసిద్ధత కార్యక్రమం లెవల్ వన్ టూ త్రీ అంశాలను జాలిపోనిక్ కార్యక్రమాల తరగతి గది భావనల వివరణ తరగతి గది బోధనలో కృత్యాలు, వర్క్‌బుక్ కృత్యాలు, బేస్‌లైన్ పరీక్ష పత్రాలతో పాటు ఇతర అంశాలను పరిశీలించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి,ఉపాధ్యాయులు విదుర్‌కుమార్,రవిందర్‌రెడ్డి,మారుతి,రామ్‌కిరణ్,వరుణ్‌కుమార్, మహేశ్వరిలు పాల్గొన్నారు.

# తెల్ల నాగుపామును బంధించిన కృష్ణసాగర్..



**వనపర్తి టౌన్,ఆగస్టు 9, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని కమలానగర్ సమీపంలో షాదీఖాన పక్కన నూతనంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణం ఆవరణంలో ఒక తెల్లని నాగుపామును గుర్తించిన ఆంజనేయులు సాగర్ స్నేక్ సొసైటీ కృష్ణ సాగర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పాము ఉన్న ప్రదేశానికి త్వరగా చేరుకుని వెళ్లి చూడగా తెల్లని నాగుపామును గుర్తించారు. శ్వేత నాగు పాముకు ఎన్నో సర్ప పురాణాల్లో చాలా కథలు ఉన్నాయని, ఈ పాము పరమ శివుని స్వరూపమని శ్వేతనాగుకు అత్యంత శక్తులు కలిగి ఉంటాయని భారతీయులు విశ్వసిస్తూ భారతీయులు పూజలు చేస్తుంటారని కృష్ణ సాగర్ తెలిపారు. శ్వేతనాగు కనబడిన వాటిని చూసినా వారందరికీ కూడా భగవంతుడిని ప్రత్యక్షంగా చూసినట్లు భావిస్తు ఎన్నో కథనాలు ఉన్నాయన్నారు. శ్వేతనాగు జన్యులోపం వల్లనే తెలుపు రంగులో జన్మిస్తుందని, ఇవి చాలా అరుదుగా మాత్రమే మనకు కనిపిస్తుంటాయని ఆయన తెలిపారు. ఈ తెల్ల నాగుపామును శ్రీశైలం అడవుల్లో వదిలేస్తామని ఆయన తెలిపారు.

# ఉద్యమకారులను సన్మానించుకోవడం మన బాధ్యత



**వనపర్తి టౌన్,ఆగస్టు9,ప్రభాతవార్త:** క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను సన్మానించుకోవడం మన బాధ్యత అని వనపర్తి ఆర్డీవో పద్మావతి అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో మహానుభావులు తమ ప్రాణాలు లెక్క చేయకుండా పోరాడారని అలాంటి మహనీయులను స్మరించుకోవడం వారి కుటుంబ సభ్యులను సన్మానించడం మన బాధ్యత అని ఆమె అన్నారు. ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, వారి కుటుంబ సభ్యులకు సన్మానం చేస్తున్నదని, అందులో భాగంగా బుధవారం వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామ నివాసి, క్విట్ ఇండియా ఉద్యమకారుడు బలరాం, భార్య సీతమ్మను ఆర్డీవో పద్మావతి వారి ఇంటికి వెళ్లి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సీతమ్మ తన భర్త బలరాం క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న సంఘటనలను గుర్తుకు తెచ్చుకున్నారు.

# మహనీయుల అడుగు జాడల్లో నడవాలి..

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి**



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** మహనీయులను స్మరించుకుంటూ వారి అడుగు జాడల్లో నడవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి కోరారు. క్విట్ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు మహబూబ్‌నగర్‌జిల్లా కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్, గౌతమబుద్ధుని విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశం కోసం అసువులుబాసిన అమరుల కుటుంబ సభ్యులను ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మచారి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమంలో ఏ విధంగా బ్రిటీష్ వారిని పారద్రోలామో అదేవిధంగా దేశంలోని అవినీతిపరులను, దేశానికి వ్యతిరేఖంగా మాట్లాడేవారిని తరిమికొట్టాలని కోరారు.మాజీ సైనికులసంఘం అధ్యక్షుడు వేణుగోపాల రెడ్డి, కౌన్సిలర్ రామాంజనేయులు, చిన్నవీరయ్య, రమేశ్, బుచ్చిరెడ్డి, మండలాధ్య క్షుడు రాజుగౌడ్, వెంకటయ్య, పట్టణాధ్యక్షుడు నారాయణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# కాన్‌కుర్తి, మల్‌రెడ్డిపల్లి గ్రామాలను సందర్శించిన సిఐ రవిబాబు, ఎస్సై శ్రీనివాసరావు



**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 09 ప్రభాతవార్త :** రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా సిఐ రవిబాబు, ఎస్సై శ్రీనివాస్‌రావులు దామరగిద్ద మండలంలోని సమస్యాత్మక గ్రామాలు అయిన కాన్‌కుర్తి, మల్‌రెడ్డిపల్లి గ్రామాలను సందర్శించి అక్కడి స్థానిక ప్రజలతో ఎన్నికల సమయంలో ఏర్పడే సమస్యల గురించి మాట్లాడి చర్చించారు. అక్కడి ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ల దగ్గర ఏర్పాటు చేయాల్సిన బందోబస్తుకు సంబంధించిన వివరాలను అక్కడ కావలసిన ఏర్పాట్లను పరిశీలించి, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీస్ వారిని సంప్రదించాలని ఎవరైనా ఆకతాయిలు, అనుమానితులు గ్రామంలో పర్యటించినట్లయితే 100 ఫోన్ నంబర్‌కు ఫోన్‌చేయాలని లేదా గ్రామంలో ఉండే స్థానిక సర్పంచ్‌కు, ఎంపిటిసిలకు పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని వారు సూచించారు.

# గృహలక్ష్మికి భారీగా దరఖాస్తులు..

**మండల పరిషత్‌లో 565, మున్సిపల్‌లో 145 అభ్యర్థనలు**



**భూత్పూర్,ఆగస్టు 09 ప్రభాతవార్త :** ఇంటికి సొంత స్థలముండి ఇల్లు కట్టుకోలేని గృహిణులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3 లక్షల నూతన పథకం గృహలక్ష్మికి భూత్పూర్‌లో మంచి స్పందన ఉంది. బుధవారం ఒక్కరోజే ఎనిమిది వందల దరఖాస్తులు రావడం చూస్తే సొంతజాగా ఉండి ఇల్లు అవసరం ఆవశ్యకత తెలుస్తోంది. తాజాగా బుధవారం గృహలక్ష్మికి మున్సిపల్ కార్యాలయంలో 163 దరఖాస్తులు, మండల పరిషత్ కార్యాలయానికి 630 దరఖాస్తులు అందాయి. గృహలక్ష్మికి గడువు గురువారంతో ముగియనుండడంతో చివరిరోజు మరిన్ని గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయని మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్, కమిషనర్ నూరుల్ నజీబ్‌తో పాటు ఎంపిడిఓ మున్ని తెలిపారు.

# వనపర్తికి రైల్వే లైన్ మంజూరు చేసిన ప్రధాని మోడీ..!

**- ధన్యవాదాలు తెలిపిన బీజేపీ నాయకులు**

**వనపర్తి టౌన్,ఆగస్టు 9, ప్రభాతవార్త:** బీజేపీ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ గద్వాల టు డోర్నకల్ వయా వనపర్తి మీదుగా రైల్వే లైన్ సర్వే పనుల కోసం 7.40 కోట్ల రూపాయలు మంజూరు చేయడాన్ని హర్షిస్తు నరేంద్ర మోడీ కి ధన్యవాదాలు తెలుపుతు బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సబిరెడ్డి వెంకటరెడ్డి, బి.కృష్ణ, డి.నారాయణ మాట్లాడుతూ... వనపర్తి జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే లైన్ మంజూరు కొరకై ప్రధాన మంత్రి నరేంద్రమోడీ డోర్నకల్ టు గద్వాల వయా సూర్యాపేట కల్వకుర్తి నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల 269 కిలో మీటర్ల రైల్వే లైన్ సర్వేకై 7.40 కోట్ల రూపాయలను విడుదల చేయడం హర్షణీయమని అన్నారు. దేశంలో అత్యధిక కాలం పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ గద్వాల - మాచర్ల రైల్వే లైన్ పేరిట నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రజలను మోసం చేశారని కానీ ప్రధాని మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిత రైల్వే లైన్ ప్రాంతంలో బీజేపీ ఎంపీలు గెలవకపోయినా వెనుకబడి ప్రాంతాల అభివృద్ధికి రైల్వే లైన్ మంజూరు చేయడం జరిగిందని, రైల్వే లైన్ మంజూరితో మిగతా ప్రాం



బాణా సంచా కాల్చి హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

తాలతో రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రవాణా సౌకర్యం సులభతరం కావడంతో నూతన పరిశ్రమల స్థాపనకు వనపర్తి జిల్లాలో విరివిగా అవకాశాలు ఉంటాయని, రైల్వే లైన్ మంజూరు చేసిన నరేంద్రమోడీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ జింకల కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నారాయణ, రామన్ గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సీతారాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, సుమిత్రమ్మ, జిల్లా కార్యదర్శులు చిత్తారి ప్రభాకర్ , పరుశురాం, జిల్లా అధికార ప్రతినిధి బచ్చు రాము, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమార్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యం, పట్టణ ప్రధాన కార్యదర్శి సూగూరు రాములు, రాయన్న సాగర్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నారాయణ, నందిమల్ల రవి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ విజయ్, బీజేవైఎం నాయకులు తిరుమలేష్, శివ పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా దినోత్సవంలో వాకిటి శ్రీహరి..



కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**మక్తల్,ఆగస్టు 09 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమాన్ని పురస్కరించుకుని జిల్లా అధ్యక్షులు వాకిటి శ్రీహరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. క్విట్ ఇండియా ఉద్యమ నేపథ్యంలో జరిగిన సంఘటనలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ భారతదేశంలో బ్రిటిష్ పాలన ముగియాలని డిమాండ్ చేస్తూ అచల భారత కాంగ్రెస్ కమిటి ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమం, రెండవప్రపంచ యుద్ధ సమయంలో 1942 ఆగస్టు 8న మహాత్మాగాంధి కాంగ్రెస్ కమిటి ఆధ్వర్యంలో ముంబైలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉద్యమానికి పిలుపునివ్వడం జరిగిందని దీనిని ఆగస్టు ఉద్యమం అని కూడా అంటారని అన్నారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బి. నర్సింలును సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బి. నర్సింలు, గొల్లపల్లి నారాయణ, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మొహ్మద్ నూరుద్దిన్, రవికుమార్ పట్టణ అధ్యక్షుడు, కట్ట వెంకటేష్, బిసి మండల అధ్యక్షుడు బోయ వెంకటేష్, నియోజకవర్గం సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకుడు మల్లేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రవికుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కల్లూరి గోవర్ధన్, అంజప్ప, మహ్మద్ అబ్దుల్ రెహమాన్,మైనార్టీ పట్టణ అధ్యక్షుడు అసముద్దిన్, అన్వర్, విఠల్, ఓబులేష్, కావలి రాజేందర్, కురుమయ్య, నర్సింలు, శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు వెడల్పులో జరిగే అభివృద్ధిలో సమతుల్యం పాటించండి..



పీర్లగుట్ట నుండి వచ్చే వరదను మళ్లించాలని కోరుతున్న అచలపక్ష ఐక్యవేదిక నాయకులు

**వనపర్తి టౌన్,ఆగస్టు 9, ప్రభాతవార్త:**రోడ్డు వెడల్పుల్లో జరిగే అభివృద్ధిలో సమతుల్యం పాటించి,పీర్లగుట్ట నుండి వచ్చే వరదను మూడు కాలువల గుండా మళ్లించి వెంగల్ రావు కాలనీ ముంపు లేకుండా కాపాడాలని మంత్రి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌లకు మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.బుధవారం కాలనీవాసుల విజ్ఞప్తిమేరకు రామాలయం నుండి పంచాయతీ ఆఫీస్‌వరకు నిర్మిస్తున్న వరద కాలువను పరిశీలించి సతీష్‌యాదవ్,కాలనీవాసులు మాట్లాడారు.40సం.ల క్రితం వెలసిన వెంగళ్‌రావు కాలనీ, సాయినగర్ కాలనీ, ఆర్టీసీ కాలనీలలో వెంగళ్ రావు కాలనీ లోతట్టుగా ఉండడం వల్ల పీర్లగుట్ట నుండి వచ్చే నీరు పెద్ద ఎత్తున వెంగళ్‌రావు కాలనీ వైపు వచ్చి ముం చెత్తడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఇప్పుడు రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నందున పెద్ద కాలువలు నిర్మించడం జరుగుతుందని, పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి వచ్చే వరద నీరు, పీర్లగుట్ట నుండి వచ్చే సగం వరద నీరు ఆర్టీసీ కాలనీ ద్వారా మలపాలని, పీర్లగుట్ట నుండి ఆర్టీసీ కాలనీ ద్వారా యధావిధిగా వచ్చే వరద నీరు వెంగళ్‌రావ్ కాలనీ ముంపు బారినపడకుండా ఉంటుందని ఇది గమనించి సంబంధిత అధికారులు, గుత్తెదారులకు మార్గనిర్దేశం చేసి కాలువలు నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన రేషన్ డీలర్లు..



సీఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్లు

**ఉప్పునుంతల,ఆగస్టు 09 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ల డిమాండ్ మేరకు సానుకూలంగా స్పందించి కమిషన్ 70 నుండి 140 రూపాయలకు పెంచడంతో బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తాలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పాపిశెట్టి కుమారస్వామి ఆధ్వర్యంలో సీఎం కెసిఆర్, అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు రేషన్ అందిస్తూ ఎన్నో ఒడిదుడుకలు ఎదుర్కొంటూ పని చేస్తున్నామన్నారు.రాష్ట్ర రేషన్‌డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. అదేవిధంగా డీలర్లకు హెల్త్‌కార్డు ఇవ్వడంతోపాటు కరోనా బారిన పడి మృతి చెందిన 100 మంది డీలర్ల వారసులకు షాపులు కేటాయించడం, వే బ్రిడ్జి ఏర్పాటు, డీలర్ల లైసెన్సులు రెన్యువల్ 2 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వరకు పెంపు, హైదరాబాద్‌లో రేషన్ భవనం ఏర్పాటు, చనిపోయిన రేషన్ డీలర్లు చనిపోయిన వెంటనే తక్షణ సహాయం కింద 10 వేల ఆర్థిక సహాయంతో పాటు 13 డిమాండ్లను పరిష్కరించడం జరిగిందని అన్నారు.సీఎం కెసిఆర్, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా. గువ్వల బాలరాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు పాపిశెట్టి కుమారస్వామి, శంకర్‌నాయక్, అబ్బుబాకర్ అలీబేగ్, తిరుపతయ్య, వేణుగోపాల్, సత్యనారాయణ, ఉల్పర వెంకటయ్య, లింగమయ్య, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# ఎస్ఐగా ఎన్నికైన స్వాతికి ఘన సన్మానం..



ఎస్ఐ ఉద్యోగం సాధించిన స్వాతిని సన్మానిస్తున్న దృశ్యం

**వీపనగండ్ల,ఆగస్టు9, ప్రభాతవార్త:** గోపల్‌దిన్నె రైతు కమిటీ, గోపల్‌దిన్నె గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎస్ఐ ఫలితాలలో గ్రామానికి చెందిన కుమ్మరి భాస్కర్, వెంకటమ్మ దంపతులకు చెందిన రెండో కుమార్తె స్వాతి ఎస్ఐగా ఎన్నికైన సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుల సమక్షంలో సన్మానించారు.ఈసందర్భంగా సింగిల్‌విండో మాజీచైర్మన్ బాల్‌రెడ్డి,గ్రామసర్పంచ్ విజయ్,రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి,మహిళా సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి, వీపనగండ్ల గ్రామసర్పంచ్ నరసింహారెడ్డి,డీలర్‌సింగయ్య శెట్టి,టీచర్ రామకృష్ణలు మాట్లాడుతూ.. వ్యవసాయ కూలీ, వృత్తిదారుల కుటుంబానికి చెందిన స్వాతి ఎస్ఐ ఉద్యోగం సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐగా ఎన్నికైన స్వాతి మాట్లాడుతూ... గ్రామ పెద్దలందరూ నన్ను సన్మానించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. నేను ఈ స్థితికిరావడానికి నాతల్లిదండ్రులు,అన్నయ్యరామకృష్ణ, అక్క, బావ కు నేను రుణపడి ఉంటానన్నారు.ఈకార్యక్రమంలో సింగిల్‌విండో మాజీచైర్మన్ బాల్‌రెడ్డి,సర్పంచ్ విజయ్,రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి, వీపనగండ్ల గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి, హెచ్ఎం శ్రీనివాసులు, డీలర్ సింగయ్య శెట్టి, కల్వరాల జగదీశ్వర్ రెడ్డి,మాజీ సర్పంచ్ కురుమయ్య,మాజీఎంపీటీసీ ఆంజనేయులు,మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మి, ఉపాధ్యక్షురాలు కవిత, సీపీఎం శేఖర్ రెడ్డి,ఆశన్న,శాంతయ్య,నాగన్న,శరత్, బాలస్వామి రెడ్డి, కోమటి నారాయణ, గ్రామ రైతులు యువకులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం..

**వనపర్తిటౌన్,ఆగస్టు9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలు పట్టించుకోవడం లేదని జిల్లా రైతు సంఘం కార్యదర్శి పర మేశ్వరచారి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు ప్రకటించి నెల రోజులు కావ స్తున్న నేటి వరకు 5 ఎకరాల వరకు మాత్రమే రైతుబంధు ఇవ్వడం జరిగింద ని, మిగతా రైతులందరికీ రైతుబంధు ఇస్తారా లేదా అనే ఆలోచనలలో రైతులు ఉన్నారని, ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని , ప్రభు త్వం వ్యవహరిస్తున్న తీరును చూస్తే రైతుబందు ఇక రాదేమోనని రైతు లు పెట్టుబడులకు రూపాయలు లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల దగ్గర అప్పులు తీసుకురావాల్సి వస్తుందని ఆయన అన్నారు. వర్షాలు సరైన టైంలో రానందున తుకాలు లేటుగా పోసుకుని వరి నారు వచ్చినా నాట్లు వేయడానికి ట్రాక్టర్ కిరాయి కూలీలకు ప్రభుత్వం రైతుబంధు ఇస్తది కదా అని అనుకుని ఉన్న రైతులకు నిరాశ మిగిలింది, ప్రభుత్వం 24 గంటల కరెంటు మాటలకే పరిమితమైందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతు సమస్యలను గుర్తించి తక్షణమే మిగతా రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలని, అదే విధంగా కరెంటు సమస్యలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఏఈ తులసి



**వనపర్తి టౌన్,ఆగస్టు 9, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని 27వ వార్డు సాయినగర్ కాలనీ రామాలయం పక్కన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పూజ చేసి ఏఈ తులసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ కిరణ్, లైన్‌మెన్ గఫార్, రాఘవేందర్, యల్,యస్.ఐ వీరాచారి, కాంట్రాక్టర్ సంపత్, రంజిత్, యువ నాయకులు శివ గౌడ్ పాల్గొన్నారు. చాలా రోజుల నుండి ఉన్నలో వోల్టేజీ సమస్యను తీర్చి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించిన వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి వార్డు ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# దేవదారికుంట తండా పాఠశాల మరమ్మతు పనులను పరిశీలించిన ఎంపిడిఓ



**ఉప్పునుంతల,ఆగస్టు 09 ప్రభాతవార్త :** మండలంలోని దేవదారికుంట తండా ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను బుధవారం ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు పరిశీలించారు. పాఠశాల భవనం దెబ్బతి నడంతో ప్రత్యేక నిధులతో మరమ్మతు పనులు చేపట్టడంతో పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆ పాఠశాల హెచ్ఎంకు సూచించారు.అదేవిధంగా తెలంగాణరాష్ట్ర క్రీడా ప్రాంగాణాన్ని పరిశీలించారు.ఎంపిడిఓ లక్ష్మణ్‌రావుతోపాటు పంచాయతీ కార్యదర్శి రవూఫ్, ఇజిఎఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సుఖజీవన్, అంగన్‌వాడి కార్యకర్త సోనమ్మ, ఆ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉప్పునుంతల తహసిల్దార్ కార్యాలయం.. వద్ద భారీగా బారులు తీరిన ప్రజలు



**ఉప్పునుంతల, ఆగస్టు 09 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి కింద దరఖాస్తులు చేసుకోవాలని, నేడు గురువారం చివరి తేదీ కావడంతో బుధవారం గృహలక్ష్మి దరఖాస్తులతో ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో కార్యాలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. సొంత ఇంటిస్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయానికి చివరి తేది ఆగస్టు 10 కావడంతో మీ సేవల వద్ద, స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద భారీగా ప్రజలు తరలిరావడంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. గడువు పెంచి ఆర్థిక స్థోమత లేని వారిని ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

# గృహలక్ష్మి దరఖాస్తులు మండల పరిషత్ కార్యాలయంలో ఇవ్వాలి..



**కెటిదొడ్డి,ఆగస్టు09 ప్రభాతవార్త:**మండలంలో సొంతస్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఓ మొహ్మద్ మొహిద్దిన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబంలోని మహిళ పేరుమీద దరఖాస్తు ఫామ్ నింపి రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు,ఆధార్‌కార్డు,రేషన్‌కార్డు,స్థలం వివరాలు,కులం, ఆదాయం సర్టిఫికెట్లు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీ జతచేసి ఈనెల 13వ తేదీ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమర్పించా లని సూచించారు.అదేవిధంగా బుధవారం సాయంత్రం వరకు మండలంలోని 23 గ్రామ పంచాయతీ నుండి వచ్చిన దరఖాస్తులు (225) వివిధ గ్రామాల నుంచి వచ్చిన దరఖాస్తుదారులు ఎంపిడిఓకు ఇవ్వడం జరిగింది.

# ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం : ఆర్ఐ



**వనపర్తి టౌన్ ,ఆగస్టు 9, ప్రభాతవార్త:** వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో ఓటర్లకు ఈవీఎం మిషన్లపై అవగాహన కార్యక్రమం సదస్సును ఆర్ఐ కృష్ణమూర్తి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండన్న, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, విష్ణువర్ధన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ..

**దరఖాస్తుల విషయంలో ప్రతిపక్షాలు, చేసే అసత్య ప్రచారాలకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 09 ప్రభాతవార్త :** ఇండ్లులేని నిరుపేదల కోసం ఖాళీస్థలం ఉండి సొంత ఇల్లు కట్టుకోవడానికి రూ.3లక్షల ఆర్థిక సహాయం అందించే గృహలక్ష్మి కోసం దరఖాస్తుదారులు దరఖాస్తు చేసే విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గ్రామ కంఠంలో ఉన్నపాత ఇల్లు కాని, స్థలాలకు కాని దస్తావేజు పేపర్లు ఉండవు. కాబట్టి ఇంటి నంబర్ అయినా సరే లేకుంటే ఖాళీ స్థలం ఉన్నా సరే దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి గడువు అయిపోయిందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దరఖాస్తుదారులు మండల ఎంపిడిఓకి దరఖాస్తులు పంపించవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ మన గద్వాల నియోజకవర్గానికి ప్రస్తుతం మొదటిదశలో 3 వేల ఇండ్లు పూర్తయిన తర్వాత రెండో దశలో ఇచ్చే గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇండ్లులేని పేదలు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదు. దశల వారిగా అర్హులైన పేదల ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి అమలు చేస్తారు. ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు చేసే అసత్య ప్రచారాలు నమ్మొద్దని, పేదలు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కోరుతున్నామన్నారు.



## గుడిసెలు వేసుకున్న పేదలుక గృహలక్ష్మి పథకం ఇవ్వాలి..

**అమరచింత,ఆగస్టు 9, ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలో దుంపాయికుంటలో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం ఇవ్వాలని డిమాండ్ చేస్తు బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ షేక్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ మాట్లాడుతూ... ప్రభుత్వం పట్టాలిచ్చి 25 ఏళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు స్థలాలు చూపకపోవడం వల్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు గుడిసెలు వేసుకుని ఆరు నెలలు గడస్తున్న ఇప్పటి వరకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు . దుంపాయికుంటలో వేసుకున్న గుడిసెవాసులకు గృహల క్ష్మి పథకం ద్వారా 5 లక్షలు ఇవ్వాలని, విద్యుత్, రోడ్లు, మంచినీటి సరఫరా, చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గృహలక్ష్మి పథకం దరఖాస్తుకు 20 రోజులు గడువు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.




## 12వ తేదీ వరకు గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చు

**ఇటిక్యాల,ఆగస్టు 09 ప్రభాతవార్త :** గ్రామాలలో సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు గాను గృహలక్ష్మి పథకం కోసం అర్హులైన వారు ఈనెల 12వ తేదీ శనివారంలోగా దరఖాస్తులు చేసుకోవాలని తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ రాఘవ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సొంత ఇల్లు నిర్మించుకునే వారికి రూ 3 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తుండగా గృహలక్ష్మి పథకంపై మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, తహసిల్దార్‌లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి గృహలక్ష్మి పథకం కోసం అర్హులైన వారినుండి ఎంపిడిఓలు దరఖాస్తులు శనివారం 12వ తేదీ వరకు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ రాఘవ ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకం కోసం ప్రజల నుండి దరఖాస్తులు తీసుకోగా మొదటిరోజు 182 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపిడిఓ రాఘవ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## మేరీ మట్టి..మేరీ దేశ్..

**- డా.బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన కళాశాల బృందం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ అప్పారావుమాటలు అందరూ ఒక సారి గుర్తు చేసుకోవాలని డా.బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపక కళాశాల బృందం పేర్కొన్నది. మేరి మట్టి మేరీ దేశ్ ( నా మట్టి..నా దేశం) కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ ఎస్ ఎస్ 1, 2, 3, 4 యూనిట్ల ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అప్పీయ చిన్నమ్మ మాట్లాడుతూ విద్యార్థులు జాతి ఔన్నత్యాన్ని గుర్తెరిగి దేశానికి గర్వకారణంగా ఎదగాలన్నారు. అడవులు దేశ ప్రగతికి ఆలంబన అని ప్రతి ఒక్కరూ మొక్క నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మాతృభూమి రుణం తీర్చుకునేందుకు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర శాఖాధిపతి శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారులు డా.సదాశివయ్య, ఎన్ సుభాషిణి, డా.రమాదేవి,డా.నందకిషోర్ పాల్గొన్నారు,.



## సంక్షేమ పథకాల పేరిట ప్రజలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### గృహలక్ష్మి పథకానికి గడువు పెంచాలి

### బిజెపి మండల పార్టీ అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం




**లింగాల,ఆగస్టు 09 ప్రభాతవార్త :** అనేక సంక్షేమ పథకాల పేరిట మరో సారి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తుందని బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లా డుతూ పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం నెరవ ర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా గృహలక్ష్మి పథకానికి ఆఖరు గడువు 10 విధించడమే కాకుండా దరఖాస్తుకు ఆదాయ, కుల, ధృవీకరణ పత్రాలు జత చేయాలని షరతులు విధించడం ఏమిటని ప్రశ్నించారు. గృహలక్ష్మి పథకానికి 3 రోజు లు మాత్రమే ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వైన్స్ టెండర్లకు మాత్రం 15 రోజుల గడువు విధించడం ఏంటని ప్రశ్నించారు. మద్యం దుకాణాలపై ఉన్న శ్రద్ధ నిరుపేద ప్రజలపై లేదనే విషయం స్పష్టంగా అర్థమవుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

## ఏడుగురికి జరిమానా..

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కే నరసింహ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి పట్టణంలో పలు చోట్ల డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఇందులో భాగంగా మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతూ 7పట్టుబడ్డారు. వారిని ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఎక్సైజ్ కోర్టులో ప్రవేశపెట్టగా వారికి జడ్జి నిర్మల జరిమానా విధించారు. అందులో ఒకరికి రూ.2వేలు, ఇద్దరికి రూ.2500, నలుగురికి రూ. 2000 చొప్పున రూ.17వేలు మొత్తం జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కుటుంబాలు రోడ్డున పడుతాయని పేర్కొన్నారు.

## మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు పోలీస్ సిబ్బంది కృతజ్ఞతలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** నూతన ఎస్పీ కార్యాలయానికి సంబంధించి వీరన్నపేటలో నిర్మించే నిర్ణయాన్ని నిలిపివేయాలని కోరుతూ జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటయ్య మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కోరారు. ఈ మేరకు ఆయన అధికారులు, సిబ్బందితో కలిసి మంత్రికి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తన విన్నపాన్ని స్వీకరిస్తూ వీరన్నపేటలో ఎస్పీ కార్యాలయాన్ని నిర్మించే నిర్ణయాన్ని విరమించుకున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. బైపాస్ సమీపంలో స్థలం కేటాయించి నూతన కార్యాలయాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ సిబ్బంది తరఫున వెంకటయ్య మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్‌మ అసోసియేషన్ సభ్యులు చిన్న మద్దిలేటి, ప్రసాద్,పద్మలత పాల్గొన్నారు.





# విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ..

**బిఆర్ఎస్ నేత విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి**



మాట్లాతున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

**మక్తల్,ఆగస్టు09 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడానికి కాలినడకన వచ్చే విద్యార్థుల కోసం ఉచితంగా సైకిల్‌లు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం విజెఆర్ స్వగృహంలో విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థుల కోసం ఎన్ని లక్షలు ఖర్చయినా ఫర్వాలేదు. గ్రామీణ నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని విద్యార్థినిలు చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగం సంపాదించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ నియోజకవర్గంలో త్వరలోనే పెద్ద ఎత్తున అన్నిమండల కేంద్రాల్లో ఉండే బాలికల పాఠశాలలకు తప్పకుండా ఉచిత సైకిళ్ల పంపిణీ చేయడం జరుగుతుందని మరీ ముఖ్య ఉద్దేశం అన్నారు. గ్రామాల నుంచి వచ్చే పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు.



సైకిళ్లు పంపిణీ చేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

## గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పొడిగించాలి..

**- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు**

**వీపనగండ్ల,ఆగస్టు 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పేద వాళ్ల కోసం గృహలక్ష్మి పథకం కింద గృహ నిర్మాణం కోసం ఆగస్టు 8వ తేదీన జీవో విడుదల చేసి కేవలం ఆగస్టు 10వ తేదీ వరకే దరఖాస్తు చేసు కోవాలని గడువు పెట్టడం అర్హులైన పేదలు, మధ్య తరగతి వాళ్లు కూడా ఈ దరఖాస్తుకు నోచుకోవడానికి సమయం సరిపోదు కావునా గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు గడువును ఆగస్టు 31 వరకు పొడి గించేటట్టుగా జీవో తీసుకురావాలని డిమాండ్ చేస్తు మండల అభివృద్ధి కార్యాలయం ముందు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తెచ్చి న గృహలక్ష్మి పథకం పేదలకు, మధ్య తరగతి వారికి ప్రయోజనకర మైనది అయినా గడువు తేదీ మాత్రం ఆగస్టు 10 వరకే పెట్టడం సరైం ది కాదని, గృహలక్ష్మి పథకం కింద గతంలో ముఖ్యమంత్రి ఐదున్నర లక్షల రూపాయలు ప్రతి పేదవానికి ఇస్తానన్న వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తు, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువసేన కార్మిక సంఘం మండల కార్యదర్శి నిరంజన్,కమిటీసభ్యులు ధర్మయ్య,మౌలాలి,లబ్ధిదారులు పుల్లమ్మ,నరసమ్మ,నరసింహ,నాగరాజు,వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు

## జిల్లా పోలీసు సురక్ష కళాబృందం అవగాహన కార్యక్రమం ..





అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**అడ్డాకల్,ఆగస్టు 9, ప్రభాతవార్త:** అడ్డాకల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సురక్ష పోలీసు కళాబృందం వారి సామాజిక అవగాహన కార్యక్రమం బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టి క్రమశిక్షణతో కృషి చేయడం వలన ఉత్తమ భవిష్యత్ లభిస్తుందని మన పెద్దలు చెప్పినట్లుగా కష్టం చేసిన వారెన్నడూ చెడిపోరని పోలీసు కళా బృందం సభ్యులు మాటలు పాటల ద్వారా వివరించారు. మన దేశంలోని యువత స్వయంకృషితో అత్యున్నత స్థాయికి ఎదుగుతున్న విషయం చూస్తునే ఉన్నామని అటువంటి వారి స్పూర్తితో విద్య వైపుగా మన గ్రామీణ యువత దృష్టి సారించి తల్లిదండ్రులకు పుట్టిన ఊరును పేరు ప్రతిష్టలు తీసుకురావాలని స్పూర్తినిచ్చారు. చిన్న వయసులో ప్రేమ అంటూ చెడు ఆలోచనలు అలవాట్ల వలన మనమెప్పటికీ ఎదగ లేమని ఒక ఉత్తమమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని పోలీసు కళాబృందం సభ్యులు ఆటపాటల ద్వారా సూచించారు. పిల్లలను ఉత్తమ మార్గం వైపు నడిపించేందుకు తల్లిదండ్రులు కుటుంబ పెద్దలు సమయం కేటాయించడం శ్రద్ధ తీసుకోవడం అవసరమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వలన జరుగుతున్న తీవ్రమైన నష్టాలు కుటుంబం మొత్తం అంతులేని దుఖంలో మునిగిపోతున్న దుర్ఘటనలు మన కండ్ల ముందు ఉన్నాయని, అందుకే పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోను వాహనాలు నడపవద్దని పెద్దలు కూడా మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా దురుసుగా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వారి కుటుంబాలను రోడ్ల పాలు చేస్తుందని పోలీసు కళా బృందం సభ్యులు పాటలతో ఎస్ఐ మాటాలతో వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్డాకల్ పోలీస్ స్టేషన్ నుండి ఎస్ఐ మాధవరెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాపతి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి

**- యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్యాంసుందర్ పిలుపు**

**అమరచింత,ఆగస్టు 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి యువజన సంఘం కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని అమరచింత మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్యాంకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు లేని పేదలకు ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటి వరకు మక్తల్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమలు ఇవ్వడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వైన్ షాపులకు దరఖాస్తు కోసం 15 రోజులు గడువు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం గృహ లక్ష్మి పథకం దరఖాస్తుకు మూడు రోజులు గడువు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి దరఖాస్తు చేసుకోవడానికి 20 రోజులు గడువు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, పోతు శ్రీధర్, హనుమంత్ నాయక్, నాగు నాయక్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




అమరచింతలో యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షులు శ్యాంకుమార్

## ముగిసిన తర్నికల్ తండా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు..

**యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి.. కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి..**

**కల్వకుర్తి,ఆగస్టు 09 ప్రభాతవార్త :** గత నాలుగు రోజులనుండి తర్నికల్ తండాలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ టోర్నమెంట్ పోటీలలో గెలుపొందిన వారికి ట్రోఫీ లను, మొదటి బహుమతి 15 వేలు, రెండవ బహు మతి 10 వేల చెక్కులను ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి విజేతలకు బహుమతు లు అందజేశారు.యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. గతనాలుగు రోజులుగా ఐక్య త ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తర్నికల్ తండా ప్రీమియర్ లీగ్ బుధవారం ముగిసింది. నాటి ఫైనల్ మ్యాచ్‌లో యంగ్‌స్టార్ బంజారా టీం కైవసం చేసుకుంది. మొదటి బహుమతి రూ. 15 వేలు, రెం డవ బహుమతి రూ. 10 వేల చెక్కులతో పాటు ట్రోఫీలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల యువతలో పోటీతత్వం, ఐక్యత భావం పెంపొం దుతాయని అలాగే శారీరక, మానసిక దృఢత్వం నెలకొంటుందని అన్నారు.టిటిపిఎల్ క్రికెట్ టోర్నీని సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్‌వైస్ ఛైర్మన్ నిజాముద్దీన్, కల్వకుర్తి నియోజకవర్గ యుజవన కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజునాయక్, జంగయ్యగౌడ్, ఇస్తరి, శ్రీపతిరాజు, గణేష్, వసురాంనాయక్, అభినవ్‌రెడ్డి, హసన్, శ్రీనునాయక్, చందు, గోపాల్, శేఖర్, వినోద్, బాలక్రిష్ణ, శ్రీనునాయక్, మహేష్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

## టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి..

**మహ్మదాబాద్,ఆగస్టు 09 ప్రభాతవార్త :** ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పీఆర్సీ కమిటిని ఏర్పాటు చేయడంతో పాటు వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించాలని పిఆర్‌టియు టిఎస్ అధ్యక్షులు విజయానంద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం మహ్మదాబాద్ మండలంలోని పలు పాఠశాలల్లో పర్యటించి ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపిఎస్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మండల అసోసియేట్ బాధ్యులు నర్సింలు, పాండు, హరికృష్ణ పాల్గొన్నారు.



టీచర్లకు సభ్యత్వం ఇస్తున్న పిఆర్‌టియు టిఎస్ నాయకులు

## కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం..

**- టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ అన్నారు. నవాబుపేట మండలం ఫతేపూర్ మైసమ్మ ఆలయం వద్ద తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రచార రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని కాకర్లపహాడ్ గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. వచ్చే మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. కాంగ్రెస్ హాయంలో జరిగిన అభివృద్ధి నేటికి కనిపిస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు.

## రేపు జిల్లా కేంద్రంలో జరిగే ఉపాధ్యాయ ధర్నాను విజయవంతం చేయండి


**ఉప్పునుంతల,ఆగస్టు 09 ప్రభాతవార్త :** ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ పేరుతో వివిధ దశలో తెలంగాణ పాత్ర ఉపాధ్యాయ సంఘం (తపస్) నిర్వహిస్తున్న ఉద్యమంలో భాగంగా రేపు 11న శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ ఉపాధ్యాయులను కోరారు. బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద ఉప్పునుంతల కాంప్లెక్స్ హెచ్‌ఎం హన్మంతరెడ్డి చేతుల మీదుగా గోడపత్రికను విడుదల చేశారు. స్థానిక ఎమ్మార్సీలో జరుగుతున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ బదిలీలు ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాని, సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, 317 జిఓ వల్ల నష్టపోయిన ఉపాద్యాయులకు న్యాయం చేయాలని, పండిట్ పిఇటి పోస్టులను ఉన్నతీకరించాలని అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని తదితర అంశాలపై చర్చించారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నల్లబోతుల నాగరాజు భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించిన జూపల్లి



**వీపనగండ్ల,ఆగస్టు9,ప్రభాతవార్త:**వీపనగండ్ల మండలం తూముకుంట గ్రామానికి చెందిన నల్లబోతుల నాగరాజు గత కొన్ని రోజులుగా పచ్చ కామెర్లతో బాధపడుతూ మంగళవారం మరణించడం జరిగింది. బుధవారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగరాజు భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈకార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు,మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు గోదల బీరయ్య, గ్రామసర్పంచ్,మండలంలోని వివిధగ్రామాల ప్రజలు, మాజీప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


## రెండోరోజు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు స్వీకరించిన ఎంపిడిఓ



**మూసాపేట,ఆగస్టు 09 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో రెండవరోజు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గెలిచిన ఎంపిడిఓ స్వరూప, బుధవారం గృహలక్ష్మి పథకానికి చక్రాపూర్ నుండి 100, దాసర్‌పల్లి నుండి 32, జానంపేట నుండి 60, కొమిరెడ్డిపల్లి నుండి 25, మహ్మద్ హుసేన్‌పల్లి నుండి 25, మూసాపేట నుండి 75, నందిపేట నుండి 21, నిజాలపూర్ నుండి 78, పోల్కంపల్లి నుండి 5, సంకలమద్ది నుండి 73, స్ఫూర్తితండా నుండి 26, తిమ్మాపూర్ నుండి 7, తుంకిల్‌పూర్ నుండి 7, వేముల నుండి 106 మొత్తం 640 దరఖాస్తులు వచ్చాయని ఎంపిడిఓ స్వరూప, ఎంపిఓ సరోజ తెలిపారు.

## నవాబ్‌పేట తహసిల్దార్‌గా మల్లికార్జునరావు

**నవాబ్‌పేట,ఆగస్టు 09 ప్రభాతవార్త :** నవాబ్‌పేట మండల నూతన తహసిల్దార్‌గా భ్రమరౌతు మల్లికార్జునరావును నియమించారు. ఈయన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం కోడేరుమండలం నుండి ఇక్కడికి వచ్చారు. నేడు ఈయన పదవి బాధ్యతలు చేపట్టానున్నారు.



## తపాలా శాఖ ద్వారా జాతీయ జెండాల విక్రయం

**చిన్నచింతకుంట,ఆగస్టు 09 ప్రభాతవార్త :** హర్‌ఘర్ తిరంగాలో భాగంగా భారత ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా కేవలం రూ. 25 కే జాతీయ జెండాలను విక్రయిస్తుందని లాల్‌కోట తపాలా శాఖ ఎస్‌పిఎం గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్‌లో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. మీకు దగ్గరలో ఉన్న లాల్‌కోట పోస్టాఫీస్‌లో జాతీయ జెండాలు లభ్యమవుతాయని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న వారికి ఇంటి వద్దకే జాతీయ జెండాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీఎంతోపాటు బిపిఎంలు భాస్కర్, నరేందర్‌లు తెలిపారు.



## కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల సంక్షేమం..

**- మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి**



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న జి మధుసూదన్‌రెడ్డి

**చిన్నచింతకుంట, ఆగస్టు9, ప్రభాతవార్త:** కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల సంక్షేమం జరిగిందని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీసీకుంట మండలంలోని ఉంద్యాల తండాలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండా అభివృద్ధి కాంగ్రెస్ ఉన్నప్పుడే జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. రూ.500కే సిలిండర్, పేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందజేయనున్నట్లు వివరించారు. ఈసందర్భంగా ఉంద్యాల తండాలో జీఎంఆర్‌కు గిరిజనులు ఘనస్వాగతం పలికారు. సాంప్రదాయనృత్యాలతో హారతులు పట్టారు. కార్యక్రమంలో పార్టీమండల అధ్యక్షుడు పల్లమర్రి నరేందర్‌రెడ్డి, యూత్‌మండలాధ్యక్షుడు వెంకటేశ్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఉంద్యాల వెంకటేశ్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జాకీర్, మాజీ సర్పంచ్ పెంటూ నాయక్ పాల్గొన్నారు.



గిరిజనులతో నృత్యం చేస్తున్న జి మధుసూదన్‌రెడ్డి

## స్వాతంత్ర సమరయోధులకు ఘనంగా సన్మానం..

**జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ**

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 09 ప్రభాతవార్త :** ఆజాది కా అమృత్ మహోత్సవ్ పురస్కరించుకుని క్విట్ ఇండియా ఉద్యమం 84 సంవత్సరాలుపూర్తి చేసుకున్న సందర్భంగా ఈ పర్వదినం నాడు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న మన ప్రాంతంలో నివసిస్తున్న స్వాతంత్ర సమర యోధులకు, వారి కుటుంబ సభ్యులకు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, వారి కుటుంబ సభ్యులు, తొలిదశ, మలిదశ ఉద్యమకారులు వారి కుటుంబసభ్యులకు, మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులకు మాజీ పోలీస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులకు సన్మాన కార్యక్రమంలో భాగంగా డికె బంగ్లాలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ, బ్రహ్మయ్య, ఎక్స్ సర్వీస్‌మెన్ వీరేష్, లింగయ్య, రాముడు, కిష్టన్న, ఫ్రీడమ్ ఫైటర్ ఆనంద్, ఎక్స్ సర్వీస్ మెన్ ప్రతాప్, జంగయ్య, గౌరీశంకర్, గడ్డయ్య, నాగరాజులను సన్మానించారు.



స్వాతంత్ర సమరయోధులను సన్మానిస్తున్న దృశ్యం

## ఏఎన్ఎంలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయుసి ఆధ్వర్యంలో ట్యాబ్స్‌తో బతుకమ్మ ఆట పాటలతో నిరసన..

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 09 ప్రభాతవార్త :** తెలంగాణలో ఉన్న కాంట్రాక్టు ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏఐటియుసి జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బతుకమ్మ ఆటపాటలతో పెద్ద ఎత్తునధర్నా కార్యక్రమం చేశారు. ట్యాబ్స్‌ను పెట్టి బతుకమ్మ ఆటపాట ఆడుతూ ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ధర్నాలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఎఎన్ఎంలను ఆర్టీసి, విఆర్ఎ, సెర్ఫ్ కాంటాక్ట్ అధ్యాపకులను ఎలా క్రమబద్ధీకరించారో అదేవిధంగా ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. భేషరతుగా నోటిఫికేషన్ రద్దుచేసి షరతులు లేకుండా ప్రాణాలకు తెగించి కష్టపడుతున్న కాంట్రాక్టు ఎఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని లేకపోతే 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రంగన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న, ఎఎన్ఎంలు, జిల్లా అధ్యక్షురాలు పద్మ, విద్యావతి, జ్యోతి, రాధా, భారతి, దేవి, కవిత, మాధవి, అరుణ, మద్దమ్మ నాయకులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఎఎన్ఎంలు

## జిల్లా ఆర్ఐగా బాధ్యతలు చేపట్టిన డి. శ్రీనివాస్

**గద్వాల ప్రతినిధి,ఆగస్టు 09 ప్రభాతవార్త : సూర్యాపేట జిల్లా నుండి జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీపై వచ్చిన ఆర్ఐ డి. శ్రీనివాస్, జిల్లా ఎస్పీ కె.సృజనను మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సాయుధదళ డీఎస్పీ పి. ఇమ్మానియేల్ పాల్గొన్నారు.**



## బూత్ కమిటి సభ్యులందరు కలిసికట్టుగా పని చేయాలి:ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 09 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన నాగర్‌కర్నూల్ నియోజకవర్గ బూత్ కమిటి సమావేశంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణులు కృష్ణచైతన్యరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ జక్క రఘునంద్‌రెడ్డి, తెరాస రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే సతీమణి జమునరాణిలు ఈసందర్భంగా తెలంగాణ తల్లి, ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బూత్ కమిటి సభ్యుల పాత్ర కీలకం అన్నారు. బూత్‌స్థాయిలో పార్టీ కార్యకర్తలు పార్టీ విజయంకోసం కష్టపడి పని చేయాలన్నారు. నియోజకవర్గంలో గత 10 ఏళ్లుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలపై ఎత్తులు వేస్తూ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరుపని చేయాలని సూచించారు. మూడు గంటల కరెంటు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రైతులకు ఎంజెఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రత్యేక పథకం చేపడుతున్నామని తెలిపారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో లక్షమెజార్టీతో గెలిపించాలని కోరారు.

**దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ...** వలసల పాలమూరు ఈ రోజు పచ్చని పంటలతో కళకళలాడుతుందని అన్నారు. ఒకప్పుడు డిగ్రీ కళాశాల లేని నాగర్‌కర్నూల్‌లో ఇప్పుడు మెడికల్ కళాశాల వచ్చిందన్నారు. ఒకప్పుడు ఎండిన కేసరి సముద్రం ఈరోజు నడిబొడ్డులో బుద్ధునితో సుందరంగా తీర్చిదిద్దామని అన్నారు. ఇంత అభివృద్ధి చెందిన నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బూత్ కమిటి సభ్యులందరు నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల బూత్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## సీఎంను ఒప్పిస్తా ఆర్యవైశ్య కార్పోరేషన్ వచ్చేలా చేస్తా..

**ఆర్యవైశ్యులకు ఆత్మీయ మిత్రుడు సీఎం**

**ఆర్యవైశ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**

**అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

అచ్చంపేట, ఆగస్టు 09 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని ఆలోచనలు చేసి నిర్ణయాలు తీసుకుంటారని ముఖ్యమంత్రిని మెప్పించి ఆర్యవైశ్యుల ఆకాంక్ష కార్పోరేషన్ వచ్చేలా కృషి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం అచ్చంపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో అచ్చంపేట ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అచ్చంపేట అధ్యక్షుడు బంధం రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర విద్యా కమిటి చైర్మన్ మిడిదొడ్డి శ్యామ్‌సుందర్, జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి చంద్రకుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ ఆర్యవైశ్యులలో 30 శాతం ఇంకా వెనుకబడిన వారు ఉన్నారని చెప్పారు. వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు



09ఎంబిఎన్ఆర్ 26: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అందిస్తామని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన 10 సంవత్సరాల కాలంలో ఆర్యవైశ్యులకు అండగా ఉన్నానని అన్నారు. ఎల్లప్పుడు వైశ్యులకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అందరికి భిన్నంగా ఆర్యవైశ్యులు అన్నారు. వైశ్యులలో పేదలను ఆదుకునేందుకు కార్పోరేషన్ అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. వైశ్యులకు రాష్ట్రంలో ఏ సమస్య లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హామీ ఇచ్చి రాబోయే రోజుల్లో తనకు అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా మిడిదొడ్డి శ్యామ్‌సుందర్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యులకు అందిస్తున్న సహాయ సహకారాలను వివరించారు. ఆర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పాటుతో మేలు జరుగుతుందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ వైశ్యుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యేలకు వినతి పత్రం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకలలో అవకాశం ఇవ్వాలని కోరారు. పలువురు ఆర్యవైశ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శివ్వ జగదీశ్వర్‌రావు, అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, సత్యనారాయణ, సంబు వెంకటరమణ, జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ కార్యదర్శి గుడిపల్లి రవి, మిరియాల రాజయ్య, మార్కెట్ చైర్మన్ అరుణ, ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్ కందూరు సుధాకర్, మెడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## విశ్వశాంతి మహాయాగాన్ని దిగ్విజయం చేయాలి..

**శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీతో కలిసి మహాయాగం ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 09 ప్రభాతవార్త :** జడ్చర్లలో నిర్వహిస్తున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నిర్వాహకులకు సూచించారు. 24వ వార్డు క్లబ్ రోడ్డులోని సమీకృత బాలుర వసతి గృహం వద్ద ఈనెల 14 నుంచి 27 వరకు నిర్వహించనున్న మహాయాగం ఏర్పాట్లను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకు లతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అంతకు ముందు శ్రీకృష్ణపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీతో కలసి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి యాగం ఏర్పాట్లపై చర్చించారు.



యాగం ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**గో ఆధారిత వ్యవసాయం ఆరోగ్యకరం.....**

గో ఆధారిత వ్యవసాయం శ్రేయస్కరమని, అందరికి ఆరోగ్యకరమని బిఆర్‌రెడ్డి గార్డెన్‌లో అచల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వకాలంలో గో ఆధారిత వ్యవసాయం చేయడం వల్లే అందరు ఆరోగ్యంగా ఉన్నారని, ఆయుషు కూడా ఎక్కువగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం రసాయనాలు ఎరువుల వల్ల భూసారం కోల్పోయి నాణ్యమైన వస్తువులు దొరకడం లేదన్నారు. ఆవు వల్ల మానవాళికి ఉపయోగపడే పాలు, పెరుగు, నెయ్యిలాంటి ఎన్నో నిత్యావసరాలు ఉన్నాయన్నారు. గోమూత్రంతో అనేక రకమైన ఔషధాలు తయారు చేస్తారనిని, భూసారానికి కూడా బాగా ఉపయోగపడుతుందని అపర సంజీవనిగా పని చేస్తుందన్నారు. అచల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గో మహా పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి రవిందర్, మార్కెట్ కమిటి చైర్మన్ మన్నెం గోవర్ధన్‌రెడ్డి, సంగీత నాటక అకాడమి మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, నాయకులు పాలాది రామ్మోహన్, పిట్టల మురళి, కౌన్సిలర్లు, ముడా డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర..!

**క్విట్ ఇండియా డే సందర్భంగా జెండా ఎగురవేసిన జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 09 ప్రభాతవార్త :** దేశానికి స్వాతంత్రం తేవడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. క్విట్ ఇండియా దేను పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీ జెండాను ఎగురవేశారు. స్వాతంత్రానికి పూర్వం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉప్పు సత్యాగ్రహం, నిరాహార దీక్షలు, క్విట్ ఇండియా ఉద్యమం లాంటి పెద్ద పెద్ద ఉద్యమాల ద్వారా బ్రిటిష్ వారిని ఈ దేశం నుండి తరిమికొట్టేందుకు మహాత్మాగాంధితో కలిసి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభయ్ పటేల్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్ లాంటి ఎంతో మంది మహానేతలు చేసిన వీరోచిత పోరాటం క్విట్ ఇండియా ఉద్యమం అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో నియంత పాలన కొనసాగిస్తున్న బిఆర్ఎస్, బిజెపిపార్టీలను గద్దె దించేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఉద్యమంలో ప్రజలంతా కలిసి రావాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను, భూములను కార్పోరేటర్లకు కట్టబెడుతున్న బిఆర్ఎస్, బిజెపిలపై క్విట్ ఇండియా ఉద్యమ స్పూర్తితో తిరగబడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్టీసెల్ జిల్లా చైర్మన్ లింగం నాయక్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రముఖ ఆదివాస నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం యువజన కాంగ్రెస్ దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాసు యాదవ్‌తో కలిసి యువజన కాంగ్రెస్ సమావేశంలో పాల్గొని యువజన కాంగ్రెస్ నాయకులకు ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి ప్రధాన కార్యదర్శులు వినోద్, సంజీవ్ ముదిరాజ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, జిల్లా కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి బెనహర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వసంత రాఘవేంద్రరాజు, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, జిల్లా మాజీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనిత, జిల్లా ఎస్సీ అధ్యక్షుడు సాయిబాబా, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు లింగంనాయక్, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ ఫయాజ్ పాల్గొన్నారు.




కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తున్న మధుసూదన్‌రెడ్డి

## క్విట్ ఇండియా స్పూర్తితో దేశాన్ని కాపాడుకుందాం..

**- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు9, ప్రభాతవార్త:** క్విట్ ఇండియా స్పూర్తితో దేశాన్ని కాపాడుకుందామని , కార్మిక వ్యతిరేఖ విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త పిలుపులో భాగంగా మహబూబ్‌నగర్ టౌన్ హాల్‌లో 48గంటల మహాపడవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యర్కమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు వెంకటేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏండ్లు అవుతుందని, కార్మిక చట్టాలను పూర్తిగా మారుస్తూ నాలుగు లేబర్ చట్టాలను పూర్తిగా పెట్టుబడిదారుల ప్రయోజనాలు కలిగేవిధంగా మార్చడం జరిగిందన్నారు. వంటగ్యాస్, నిత్యావసరాల ధరలు పెరిచి సామాన్యుడి నడ్డి విరిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలు అందజేయాలన్నారు. మణిపూర్ సమస్యను కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాయక్, ఎన్ కురుమూర్తి, వివిధ ప్రజాసంఘాల నాయకులు సాంబశివుడు, దేవదానం, సురేష్, ఆంజనేయులు, వెంకట్రాములు, బాబుమియా పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో అధికారులు కృషి చేయాలి

**నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 09 ప్రభాతవార్త :** బుధవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో కారుణ్య నియామకాలు, ఔటసోర్సింగ్ వివరాలు, ఎన్నికల విధులు, ఇతర సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 448 మంది విఆర్ఎలను వ్యవసాయం, పశుసంవర్ధక, విద్యాశాఖ ఇంటర్ విద్య నీటి పారుదల, మున్సిపాలిటీ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, రెవెన్యూ, టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖలలో ఓఎస్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వారికి ఈనెల 11న 3 గం.లకు అంజనా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ పి.అశోక్‌కుమార్, ఆర్డీఓ రాంచందర్, ఎఓ నర్సింగ్‌రావు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## తొమ్మిదిన్నర ఏళ్లలో గద్వాల అభివృద్ధి శూన్యం..

**బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికెఅరుణ**



**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 09 ప్రభాతవార్త :** పట్టణంలోని డికె బంగ్లాలో ప్రముఖులు, ఇంఛార్జిలు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ జడ్పీటిసిలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, జిల్లా మోర్చా నాయకులు, రాష్ట్ర నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడమైనది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ హాజరై మాట్లాడుతూ గద్వాలను అభివృద్ధి చేసింది నేనే గెలిచేది నేనేనని డికె అరుణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది బిజెపి ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేసేశక్తి అరుణమ్మకుందని, ఏ పార్టీలో ఉన్నా గద్వాల ప్రజలకు అందుబాటులో ఉంటానని, అభివృద్ధి చేస్తానని గ్రామాల్లో కెసిఆర్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరని, ఆర్డీఎస్ కోసం నా ప్రాణాలు పణంగా పెట్టి కొట్లాడిన నెట్టెంపాడు కోసం గద్వాల నుండి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేయడం జరిగిందన్నారు. ఈ తొమ్మిదిన్నరేళ్లలో గద్వాల అభివృద్ధి శూన్యమని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అన్నారు.

## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన రేషన్ డీలర్లు..



**గద్వాల ప్రతినిధి, ఆగస్టు 09 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ కమిషన్‌లను 140 రూపాయలకు పెంచినందుకు ఎమ్మెల్యేకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మధు, జిల్లా రేషన్ డీలర్ సంఘం కోశాధికారి అబ్దుల్ ఖాదిర్, సంయుక్త కార్యదర్శి ఎంఎ గౌని, ఉపాధ్యక్షుడు రంజిత్‌కుమార్, సభ్యులు టి. శ్రీనివాసులు, జిల్లా రేషన్ డీలర్ సభ్యులు పాల్గొన్నారు.